# నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్న నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో నామినేషన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల మధ్య నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఈ నెల 5వ తేదీన ఆదివారం సెలవుకావడంతో నామినేషన్లు స్వీకరించబడవన్నారు. ఒకేరోజు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు వస్తే టోకెన్లు జారీచేసి క్రమసంఖ్య ప్రకారం నామినేషన్లు స్వీకరించాలన్నారు. ముహుర్తాలు బావున్నాయని ఆ రోజుల్లో అధికసంఖ్యలో అభ్యర్థులు వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ ప్రక్రియపై అవగాహన, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను తూచా తప్పక పాటించాలన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులను, మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ వేసేందుకు అవకాశం ఉందన్నారు. జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.10 వేల డిపాజిట్ ఉంటుందని, రిజర్వుడ్ అభ్యర్థులకు రూ.5 వేల డిపాజిట్ ఉంటుందని, రిజర్వుడ్ అభ్యర్థులు కుల ధ్రువీకరణ అందజేయాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

రాష్ట్రంలో ఎక్కడ ఓటు ఉన్నా అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం ఉందని, అయితే బలపరిచే వ్యక్తులు ఆ నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలని, ఇతర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఆయా మండలాల తహసీల్దార్ల ద్వారా పొందిన ధ్రువీకరణ అందజేయాలన్నారు. నామినేషన్‌లో అసంపూర్తిగా ఉన్న అంశాలపై ఆర్వో నోటీసులు జారీ చేయాలని చెప్పారు. నామినేషన్ల వివరాలను క్రమంతప్పక రిజిష్టర్‌లో నామినేషన్లు దాఖలు తేదీ, సమయం తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆర్వో కార్యాలయాల్లో ఓటరు జాబితా, చెక్‌లిస్టు అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్ఓవో నిషిత పరిశీలన తదుపరి నామినేషన్ పత్రాలపై ధ్రువీకరణ చేయాలని చెప్పారు. ప్రతి రోజు నామినేషన్లు దాఖలుపై ఆర్వోలు నివేదికలు అందజేయాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, శిరీష, కార్తీక్, మంగీలాల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, డీటీ రంగాప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శాంతి

చుంచుపల్లి, నవంబర్ 1 : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బదావత్ శాంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శాంతి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకొని మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. వాటికి అధికారులు సానుకూలంగా స్పందించి ఎన్నికల కోడ్ అనంతరం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో మంగమ్మ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అడిగిన వారికి 'ఉపాధి' కల్పించాలి

### ఎంపీడీవో అప్పారావు

పాల్వంచ రూరల్, నవంబర్ 1 : పంచాయతీల్లో పని కావాలని అడిగే వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అప్పారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల్లో ప్రతి పంచాయతీ నుంచి 25మంది కూలీలు తగ్గకుండా చూడాలని, పనులు కావాలన్న వారికి ఉపాధి కల్పించాలన్నారు. పారిశుధ్యం, మొక్కలకు నీరు తదితర కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో ఎంపీవో నారాయణ, ఏపీవో రంగా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 1 : చలి తీవ్రత పెరగడంతో రోడ్లపై పడుకున్న వృద్ధులు, యాచకులు, నిరుపేదలకు హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కొత్తగూడెం మెయిన్‌రోడ్, బస్టాండ్, రైల్వేస్టేషన్, గణేష్‌టెంపుల్ ఫుట్‌పాత్‌పై పడుకునే వారిని గుర్తించి మంగళవారం రాత్రి వారికి దుప్పట్లు, ఆహారపొట్లాలు అందించారు. కార్యక్రమంలో దాత అరుణ్, సభ్యులు దిలీప్, కీర్తన్, వినయ్, సుదీప్, లేంటిల్ తదితరులు పాల్గొన్నారు.

## పీవీకే5 ఇంక్లైన్‌లో సహపంక్తి భోజనాలు



పూజల్లో పాల్గొన్న కోనేరు సత్యనారాయణ

రామవరం, నవంబర్ 1 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి ఖని పీవీకే 5 ఇంక్లైన్ గని ఆవరణలోని అమ్మవారి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా బుధవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏజెంట్ బూర రవీందర్ హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, కోనేరు సత్యనారాయణ, రజాక్, కూసన వీరభద్రం, వట్టికొండ మల్లికార్జున్, గనిగళ్ల వీరస్వామి, కత్తెర్ల సాములు, దేవీసింగ్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలి

జూలూరుపాడు, నవంబర్ 1 : కమ్యూనిస్టుల ఉద్యమంలో ప్రాణాలను కోల్పోయిన అమరవీరల ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మా అన్నారు. మండల పరిధిలోని అన్నారుపాడు గ్రామంలో బుధవారం జరిగిన అమరవీరుల వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించాలని కోరారు. బాదావత్ జవహర్‌లాల్, బానోత్ ఈరు, తోటకూరి నరేశ్, బానోత్ జగదీశ్, బానోత్ ధన్వంతరావు, బాలాజీ పాల్గొన్నారు.

## లక్ష్యసాధన చేరువలో సింగరేణి



కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 1 : సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ నెలాఖరు నాటికి 95శాతం ఉత్పత్తి సాధించి లక్ష్యానికి దగ్గరలో నిలిచింది. సంస్థ సీఎండీ శ్రీధర్ దిశానిర్దేశం మేరకు డైరెక్టర్ల సూచనలతో అన్ని ఏరియాల జీఎంలు, సంబంధిత అధికారుల ప్రణాళికలతో అక్టోబర్ చివరినాటికి 95శాతం ఉత్పత్తి సాధించింది. అక్టోబర్‌లో అన్ని ఏరియాల్లో 86శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది.

### కొత్తగూడెం ఏరియాలో 91శాతం ఉత్పత్తి

రామవరం, నవంబర్ 1 : సింగరేణి కొత్తగూడెం ఏరియా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ నెలకు నిర్దేశించిన 11.89 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 10.82 లక్షల టన్నులు చేసి 91శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు ఏరియా జీఎం శాలెంరాజు తెలిపారు. రోడ్డు, రైలుమార్గం ద్వారా 12.35 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. ఈ ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 71.19 లక్షల టన్నులకు గాను 78.43 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 110శాతం ఉత్పత్తి లక్ష్యం సాధించి రోడ్డు, రైలుమార్గం ద్వారా 89.33 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు.



పట్టుబడిన గంజాయి, వ్యక్తులతో జిల్లా ఆబ్కారీ అధికారులు

## పాల్వంచలో గంజాయి పట్టివేత

పాల్వంచ, నవంబర్ 1 : జిల్లా ఆబ్కారీ అధికారి జానయ్య ఆదేశాల మేరకు సహాయ ఆబ్కారీ అధికారి కరంచంద్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 14 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పాల్వంచ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట ఉన్న ఆటోస్టాండ్ వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు లగేజ్ బ్యాగులు కలిగి అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని తనిఖీ చేయగా బ్యాగుల్లో 14 కిలోల ఎండు గంజాయి బయటపడింది. ఏపీకి చెందిన భవితోష్, ఒరిస్సాకి చెందిన కిశోర్ ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి భద్రాచలం, పాల్వంచ మీదుగా హైదరాబాద్ తరలించి అధిక ధరకు అమ్ముతున్నారని సీఐ తెలిపారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి పాల్వంచ ఆబ్కారీ స్టేషన్‌కు అప్పగించారు. వాటి విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై గౌతమ్, కానిస్టేబుల్స్ హబీబ్ పాషా, ఎల్ఆర్‌కే గౌడ్, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన తప్పనిసరి

### సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య, పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 1 : సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త కోణాల్లో మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎ.కృష్ణయ్య అన్నారు. సైబర్ దివస్‌లో భాగంగా ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు అవగాహన పొంది చుట్టుపక్కల వాళ్లకి అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు 'ఫెడెక్స్' పేరుతో కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారని తెలిపారు. అమాయకుల బ్యాంకు ఖాతాలో డబ్బు ఖాళీ చేస్తారని వివరించారు. ప్రముఖ లోన్‌సంస్థల పేర్లతో లోన్లు, క్రెడిట్‌కార్డులు ఇస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆపద సమయంలో 1930 నెంబర్‌కు కాల్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ సముద్రాల జితేందర్, కళాశాల డైరెక్టర్ శ్రీరమనేని చలపతి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కే నయీంపాషా, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాసిమళ్ల రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వనమా జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే వనమాతో కేక్ కట్ చేయిస్తున్న ఎంపీటీసీలు

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 1 : నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత పాల్వంచలోని ఆయన నివాసంలో వనమాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి స్వీట్లు తినిపించారు. కొట్టి వెంకటేశ్వర రావు, రైతుబంధు సేమితి మండల కన్వీనర్ వట్టికొండ సాంబశివరావు, ఎంపీటీసీలు తరాల రాంమూర్తి, గుర్రం బాబూరావు, వాణిరెడ్డి, శకుంతల, కొండలరావు, భాస్కర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.